# రెక్కలొచ్చిన వేళ ...

దుర్గ యర్రమిల్లి
అట్లాంటా, జార్జియా.

"అదే నీ ఆఖరి నిర్ణయమా?" అంటూ గట్టిగా అడుగుతున్న కొడుకు కేకలతో ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు హాలులో పడక కుర్చీలో నడుం వాల్చిన శాస్త్రిగారు. లోపల కొడుకు, కోడలు తర్జన భర్జన పడుతున్నారు. ఆ మాటలు తన చెవులో ఖంగుమంటూంటే కొడుకు స్థానంలో తన తండ్రి కనిపించాడు.

* * *

సుమారుగా అర్ధ శతాబ్దం క్రితం తన తండ్రి తన్ని గద్దించి అడగడం గుర్తుకు వచ్చింది. కోన సీమలో ఒక చిన్న అగ్రహారంలో శుద్ధశ్రోత్రియమైన కుటుంబంలో పుట్టాడు తను. ఇంకా బస్సులు, రైళ్ళు, రోడ్లు లేని రోజులు. అగ్రహారంనుంచి పట్నం వెళ్ళాలి అంటే బల్లకట్టు మీద పెద్దకాలువ దాటి, నడుచుకొని లంకల రేవుకి వెళ్ళి పడవమీద పట్నం వెళ్ళాలి. శాస్త్ర ప్రకారం ఎనిమిదేళ్ళు రాకుండానే ఒడుగూ, పదహారేళ్ళకి మేనమామ కూతురు సీతామహలక్ష్మితో పెళ్ళి, తన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా జరిగిపోయాయి. తనకి వచ్చిన విద్య అంతా పెద్దబాలశిక్ష, కొద్దిగా వేదం. ఓం భూర్భువస్సువః అని ఖచ్చితంగా అనలేని తనకి లెక్కలు మాత్రం బాగా వచ్చేవి. తన తెలివి తేటలమీద తండ్రికి కొంత బెంగగా వున్నా, తనకి మాత్రం తనమీద ప్రగాఢ నమ్మకం. కాని తన గుండూ పిలకా అంటే తగని అసహ్యంగా ఉండేది. అందరిలా తనూ ఉంగరాల జుట్టు పెంచుకొని, చక్కగా నూనె రాసుకొని, పక్కపాపిడితో గిరజాలు దువ్వుకోవాలని ఉబలాట పడిపోతున్న రోజులవి.

ఒక రోజు సుబ్బరాజు రూపంలో తన జీవితంలో ఒక మలుపు వచ్చింది. సుబ్బరాజు మున్నూరి రాజుగారి కోడలి అన్నగారు. ఆ రోజు బల్లకట్టు దగ్గర "మున్నూరు కెళ్ళే దారేది బాబయ్యా" అంటూ పలకరించిన సుబ్బరాజు ఇట్టే తన్ని ఆకట్టు కున్నాడు. బహుశః ఆ గిరజాల జుట్టే అయివుంటుంది.

"నాతో నడవండి, కోసుడు దూరం వెళ్ళాక అగ్రహారం నేను, మున్నూరు మీరు వెళ్ళవచ్చు" అని సమాధానం చెప్పి ముందుకు సాగాడు. దారిలో పరిచయాలు జరగడం, మళ్ళీ కాలవ గట్టు దగ్గఱ కలిసే ప్రమాణాలు జరిగాయి. అది మొదలు ఇద్దరూ తరుచుగా కలుస్తూవుండటంతో, ఆరునెలలో తనకి ప్రపంచం అంటే అగ్రహారం కాదని అర్థమయింది. కాలేజీలో చదివే సుబ్బరాజు కలిసినప్పుడల్లా సామాజిక, రాజకీయ చర్చలు లేపేవాడు. "మనిషి మనిషిలా ఎదగాలంటే ప్రపంచం చూడాలండి శాస్త్రిగారూ" అనేవాడు రాజు. అగ్రహారంలో తనతాతల నాటి వృత్తి కాకుండా, పట్నంలో వుద్యోగం చెయ్యాలన్న ఆశని తనలో రాజుకొనే నిప్పులా చేశాడు రాజు. పట్నంలో తనకి తెలిసిన వాళ్ళద్వారా పీడబ్ల్యూడిలో గుమాస్తా ఉద్యోగం వేయిస్తానని మాట యిచ్చాడు రాజు శాస్త్రికి. ఆ రోజుల్లో గుమాస్తా వుద్యోగానికి పెద్ద చదువులు అక్కర్లేక పోవటంతో తనకి ఉద్యోగం రావటానికి పెద్ద అవరోధం ఏమీ కనపడలేదు. ఇక మిగిలింది నాన్నగారితో చెప్పి పట్టణానికి ప్రయాణమే! నాన్నగారితో మాట్లాడాలంటే ముందుగా తల్లి దగ్గఱ అర్జీ పెట్టుకోవాలి. భోజనాలయి మధ్యాహ్నం అందరూ నడుం వాల్చారు. సీతా మహలక్ష్మి పక్కింటి శాంతతో చింతగింజలు ఆడుతోంది. శాస్త్రి నెమ్మదిగా అమ్మ పక్కన కూర్చుంటూ, " అమ్మా నేను పట్నం వెడతానే" అన్నాడు.

"ఎందుకురా అబ్బాయి? మీనాన్నగారు ఏమైనా తిట్టారా?" అంది అమ్మ.

"అది కాదే! నాకు పట్నంలో వుద్యోగం వచ్చింది, అందుకని" అన్నాడు.

"ఏమిటీ?" అంటూ ఉలిక్కి పడి లేచిన అమ్మ "ఏమండీ వింటున్నారా? సుబ్బుడు పట్నం వెళ్ళి వుద్యోగం చేస్తాడట. అయినా ఇదేం ఖర్మరా! లంకంత ఇల్లు, వున్న వృత్తి వదులుకొని" అంది అమ్మ. చిన్నగా కునుకు తీస్తున్న తండ్రిగారు కూడా ఉలిక్కి పడి, "పట్నమా?" అన్నారు. అవునన్నట్టు బుఱ్ఱ వూపుతూ తండ్రి చూపులని తప్పించుకుంటూ శూన్యంలోకి చూస్తూనిలబడ్డాడు.

"అయినా దూరం భారం, ఎలారా నిన్ను చూడకుండా" అమ్మ అప్పుడే కళ్ళనీళ్ళపర్వం లోకి దిగింది.

"అయితే ఇదన్న మాట, ఆ రాజుగాడు నీకు చెప్పి పెట్టింది. ఏం బావుకుందామని పట్నం వెడతానంటున్నావు" అని రంకెలు వేయటం మొదలెట్టాడు తండ్రి.

ఈ హడావిడికి సీతామహలక్ష్మి చింతగింజలు వదిలేసి మేనత్తని కరుచుకు పోయింది బిక్కమొహంతో. శాంత రివ్వున బయటకు పరిగెత్తింది. పదినిమిషాల్లో నాలుగిళ్ళ అవతల వున్న తన మేనమామ, అత్తయ్య వచ్చారు. అందరూ అన్నీ అన్నారు. మాట్లాడారు. అరిచారు. గోల పెట్టారు. శాస్త్రి మాత్రం నిమ్మకి నీరెత్తినట్లు మాట్లాడకుండా నిలబడ్డాడు.

"అదేవిట్రా, ఇంతమంది ఇన్ని మాటలాడుతూంటే బెల్లం కొట్టినరాయిలా ఏం మాట్లాడవేం, సమాధానం చెప్పి తగులడు" అన్నారు తండ్రిగారు, కోపం పరాకాష్టకి కి చేరుకోవడంతో. తను నెమ్మదిగా, ఖచ్చితం అయిన కంఠంతో "పట్నం వెడతాను" అన్నాడు.

"అదేనా నీ ఆఖరి నిర్ణయం" అంటూ హూంకరించారు తండ్రి గారు. నిలువుగా బుఱ్ఱ ఊపిన తన్ని చూసి, విసురుగా, "సరే, నీ ఏడుపు నువ్వు ఏడు" అంటూ కండువా దులుపు కుంటూ తండ్రిగారు లోపలికి వెళ్ళారు.

తరువాత తను పట్నం వెళ్ళడం, కొన్నాళ్ళకి సీత కాపురానికి రావడం, సంసారం, పిల్లలు అన్ని చక చక జరిగిపోయాయి. ఇరుకుగా వున్న ఇంటిని చూసినప్పుడల్లా అగ్రహారం గుర్తుకు వచ్చేది. నెత్తిమీద నల్లగా నిగనిగ లాడుతున్న జుట్టుని చూసుకున్నపుడు తనకి చాలా గర్వంగా ఉండేది. పట్నం అంటే ఉలిక్కి పడ్డ అమ్మ, నాన్నలు, " మా అబ్బాయిది పట్నంలో పెద్ద ఉద్యోగం" అని చెప్పుకున్నారు.

* * *

పిల్లల చదువుకని కింద మీద పడి వాళ్ళ కాళ్ళు వాళ్ళ కాళ్ళు పట్టుకొని కాకినాడ వచ్చి పడ్డాడు. ఇరవై ఏళ్ళ తర్వాత కొడుకు తన దగ్గరఅకి వచ్చి, "నాన్నా, సర్వీస్ కమీషన్ పాసయ్యాను. ఢిల్లీ లో పోస్టింగ్ వచ్చింది పదిరోజుల్లో ఢిల్లీ వెళ్ళాలి" అన్నరోజు, "అయ్యో ఢిల్లీయే" అంటూ తన భార్య ఉలిక్కి పడడం కొడుకు దూరమవుతున్నాడన్న ఉక్కురోషంతో "ఏం, ఆంధ్ర దేశం గొడ్డు పోయిందా! ఇక్కడెక్కడా ఉద్యోగాలు లేవా! " అని వెటకారంగా అనడం నిన్న మొన్న జరిగినట్లుగా అనిపించింది. కన్నీళ్ళతో రామం ఢిల్లీ వెళ్ళినపుడు ఆనాటి నాన్నగారి ఆవేదన, తర్జన భర్జనలు,

హడావుడి, తన స్వార్థం ఇప్పుడు తనకి అర్థమయ్యాయి. కొడుకు సుఖం, వాడి ఉన్నతి ముఖ్యం అని మనసుకు నచ్చ చెప్పుకొని కాలంతో రాజీ పడ్డాడు.

* * *

కాల చక్రంలో చాలా ముందుకి వెళ్లి ప్రస్తుతం కొడుకు దగ్గఱ వుంటున్న తనకి చరిత్ర తిరగేసి నట్లయింది. ఇవ్వాళ మనమడు అమెరికా వెళ్ళాలి అంటూ వుంటే, తండ్రైన తన కొడుకు వాడి ఇరవై ఏళ్ళ నాటి సంగతి మరిచిపోయి అడ్డుకొంటున్నాడు. రెక్కలొచ్చాక పిల్లలు ఎగిరి పోతుంటే తల్లి పక్షి గిలిగిల లాడుతుంది. అయినా అవి గూడు వదలి వెళ్ళిపోతాయి. ఇది ప్రకృతి నియమం. మానవుడుకూడా ప్రకృతిలో భాగమేగా అనుకుంటూ శాస్త్రిగారు లోపలికి వెళ్ళారు కొడుకుకి నచ్చ చెప్పడానికి.

## ఒలింపిక్స్ ఒలింపిక్స్

### పి.వి.జి.

ఒలింపిక్స్ ఒలింపిక్స్ ఒలింపిక్స్ వచ్చాయి
మా నేస్తం హస్తాలతో వెలిగించిన కాగాడాతో
దూరాన్ని కుదించుకుంటూ కాలాన్ని విడదీసుకుంటూ
క్షణం క్షణం వెనకేసుకుంటూ ఫొటోగ్రాఫులు నింపుకుంటూ
పరుగెత్తుకు వచ్చాయి పొలోమని పొలికేకలేస్తూ
ఒలింపిక్స్ ఒలింపిక్స్ కలలుగన్న నాలోకం
మురిసిపోయి హర్షించింది.

ఎగరేసిన జెండాలు బాజా భజంత్రీలు
శబ్దగ్రహణ యంత్రాలు ఛాయాగ్రహణ సమూహాలు
టెంపొరరీ మండువాలు
వాస్తుశాస్త్రప్రకారంగా కట్టించిన విడిదిలోకి
చరిత్రలో నిద్రపోతున్న ఒలింపిక్స్‌ని లేవదీసి
చేశారు మావాళ్లంతా నూతన గృహప్రవేశం.

దేవుడిచ్చిన శక్తులన్నీ భద్రంగా పోగుచేసి
సానమీద పదును పెట్టి అందరి ముందు ఆవిష్కరించి
నరజాతికి భవిష్యత్తుందని వరప్రసాదులు మనవాళ్లని
హెచ్చరించి జోకొట్టింది
ఒలింపిక్స్ తలపుల్లో ఆత్మల సంస్కారం
ఒలింపిక్స్ పిలుపుల్లో ఫలించిన మమకారం

ఒలింపిక్స్ హడావిడిలో వినిపించిన కోలాహలం
అర్థరాత్రి అయోమయం
వ్యర్థమైన ప్రయోజనం బద్దలైన వాస్తవం
నరజాతి వెన్నెముకలో నక్కి దాగిన చీడపురుగు
బయటపడిన చీకటి క్షణం వడ్డించింది వెటకారం
ఒలింపిక్స్ ఒలింపిక్స్
కలలుగన్న నాలోకం హడలిపోయి ముడుచుకుంది.

## QUOTES...

"At the stroke of the midnight hour, while the world sleeps, India will awake to life and freedom..."
-- Jawaharlal Nehru, August 15, 1947

"Oh lovely dawn of freedom that breaks in gold and purple over ancient skies..."
-- Rabindranath Tagore, August 15, 1947

"Wavering minds and faltering steps will never carry us forward in the path of progress."
-- Maulana Azad, 1942

"To secure to all its citizens: justice... liberty... equality... fraternity."
-- Dr. B.R.Ambedkar

"The honor of India has been symbolized by a fistful of salt... the fist... may be broken, but it will not yield up its salt."
-- Mahatma Gandhi, Salt March 1930

"A nation is not a juxtaposition of individuals. It is a society based on a communion of minds, a union of hearts."
-- Dr. Sarvepalli Radhakrishnan

"India will be raised, not with the power of the flesh, but with the power of the spirit; not with the flag of destruction, but with the flag of peace and love..."
-- Swami Vivekananda

• • •



## జ య గీ తి

జయజయజయ ప్రియభారత
జనయిత్రీ, దివ్యధాత్రి!

జయజయ సస్యామల సుశ్యామచలచ్చేలాంచల!
జయ వసంతకుసుమలతా చలితలలితచూర్ణకుంతల!
జయ మదీయహృదయాశయలాక్షారుణపదయుగళా!
జయజయజయ ప్రియభారత
జనయిత్రీ! దివ్యధాత్రి!

జయజయజయ ప్రియభారత
జనయిత్రీ! దివ్యధాత్రి!
జయ దిశాంతగతశకుంత దివ్యగానపరితోషణ!
జయ గాయకవైతాళికగళవిశాలపథవిహరణ!
జయ మదీయమధురగేయచుంబితసుందరచరణా!

-- దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి